94406 62699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21



త్వరలో మీముందుకు రానున్న
ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుల కాంటాక్ట్ బుక్‌లెట్

రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

కేవలం 1000 రూపాయలకే

విజయవాడ బందర్ రోడ్డులో ఆధునిక సౌకర్యాలతో మీటింగ్ హాలు ఏర్పాటు చేయడం జరిగింది. కేవలం 1000 రూపాయలకే ఇందులో 50 మందితో సమావేశాలు జరుపుకోవచ్చును. ఫోన్: 94406 62699

అమరావతి సంపుటి : 4 సంచిక : 42, పేజీలు 4, వెల: రూ. 2.00 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక | సోమవారం 22 - ఆదివారం 28 జూలై, 2019

Amaravati Volume : 4 Issue : 42, Pages 4, Rate : 2.00 | ANDHRA PRADESH CAPITAL'S FIRST TELUGU WEEKLY | Monday 22 - Sunday 28 July, 2019

వివరాలు 2లో...

యధేచ్ఛగా బెట్టింగ్ మాఫియా!

వివరాలు 3లో...

నిజాయతీకి C/O రోహిణి సింధూరి

వివరాలు 4 లో...

భూస్వామి కండకావరం

వివరాలు 4లో...

'ఇస్మార్ట్ శంకర్' మూవీ రివ్యూ

పన్నులు కట్టండి.. కర్తవ్యాన్ని పాటించండి

రాజధాని వార్తలు,విజయవాడ: 159వ ఇన్‌కం టాక్స్ డేను పురస్కరించుకుని నగరంలో ఆదివారం 'వాక్ ఫర్ ఐకర్ భారత్' పేరుతో ఆదాయం పన్ను కార్యాలయం వద్ద నుంచి 4కే రన్ నిర్వహించారు. ఈ 4కే రన్‌ను ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం ప్రారంభించి.. రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్‌కంటాక్స్ వాకథాన్‌ను దేశవ్యాప్తంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. ప్రజలు తమకు విధించిన ట్యాక్స్‌లను సకాలంలో చెల్లించాలని, పన్నులు సక్రమంగా చెల్లిస్తేనే.. వ్యవస్థలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చునని చెప్పారు. టాక్స్‌లు చెల్లించడం ద్వారా పౌరుల మధ్య వ్యత్యాసాలు తగ్గుతాయన్నారు. ప్రజలంతా తమ పరిధిలోని పన్నులు చెల్లించి.. తమ కర్తవ్యాన్ని పాటించాలని పిలుపునిచ్చారు.

తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదొక రికార్డు : వైఎస్ జగన్

రాజధాని వార్తలు, అమరావతి : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తన పరిపాలనలో విప్లవాత్మక అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి.. ప్రజలకు నేరుగా ప్రభుత్వ సేవలను అందించబోతోంది. ఈ వ్యవస్థ ద్వారా ఏకంగా 1,33,494 శాశ్వత ఉద్యోగాలు రానున్నాయని, మొత్తంగా 4.01 లక్షల ఉద్యోగాలను కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదివారం ట్విటర్‌లో తెలిపారు. తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదొక రికార్డు అని ఆయన స్పష్టం చేశారు. పరిపాలనలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ.. గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొస్తున్నామని, ప్రజల ఆశీర్వాదబలం వల్లే ఇది సాధ్యమవుతోందని పేర్కొన్నారు.

'తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదొక రికార్డు. 1,33,494 శాశ్వత ఉద్యోగాలు, మొత్తంగా 4.01 లక్షల ఉద్యోగాలను కల్పిస్తున్నాం. పరిపాలనలో విప్లవాత్మక మార్పుగా గ్రామ సచివాలయాలు,

వాలంటీర్ల వ్యవస్థను తీసుకొస్తున్నాం. మీ ఆశీర్వాదబలంవల్లే ఇది సాధ్యమవుతోంది'అని సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

24న కొత్త గవర్నర్ బిశ్వభూషణ్ ప్రమాణ స్వీకారం

రాజధాని వార్తలు, అమరావతి : ఏపీకి తొలి గవర్నర్‌గా బిశ్వభూషణ్ హరిచందన్ ఈ నెల 24న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. గవర్నర్ కార్యదర్శిగా ముఖేష్ కుమార్ మీనాను నియమిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బిశ్వభూషణ్ హరిచందన్ ఈనెల 22న తిరుపతి రానున్నారు. 23న శ్రీవారి దర్శనం చేసుకున్న తరువాత విజయవాడకు వెళ్తారు. 24న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఏపీకి కొత్త గవర్నర్‌గా నియమితులైన బిశ్వభూషణ్ హరి చందన్‌తో ఇప్పటికే మాట్లాడిన ఏపీ సీఎం ముఖ్యమంత్రి ఆయనకు అభినందనలు తెలిపారు. ఆ వెంటనే గవర్నర్ కార్యాలయం..నివాసం కోసం ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. దీంతో..సాధారణ పరిపాలనా శాఖ అధికారులతో పాటుగా ప్రోటోకాల్ అధికారులు రెండు కార్యాలయాలను పరిశీలించారు. రెండు కార్యాలయాల్లోని వసతి..సౌకర్యాల గురించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యంకు నివేదిక ఇచ్చారు. దీంతో..ఆయన ఈ అంశం పైన ముఖ్యమంత్రి జగన్ తుది చర్చలు జరిపి నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ బందర్ రోడ్డులోని పాత ఇరిగేషన్ కార్యాలయాన్ని గవర్నర్ కార్యాలయం..అధికారిక నివాసం రాజ్ భవన్‌గా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 2015లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్ నుండి వచ్చి ఏపీ నుండి పాలన చేయాలని భావించిన సమయంలో ఇదే భవనం నుంచి పర్యవేక్షించారు. ఆ తరువాత ఆ భవనంలో పెద్ద ఎత్తున మరమ్మత్తులు చేసారు. రెండు అంతస్థుల్లో ఉండే ఈ భవనంలో కింది ఫ్లోర్ మొత్తం కార్యాలయం కోసం..రెండో అంతస్థలో పూర్తి సౌకర్యాలతో గవర్నర్ అధికారిక నివాసంగా ఖరారు చేసారు. ఇదే సమయంలో ప్రస్తుతం రాజ్ భవన్‌లో ఉన్న సిబ్బందిని ఏపీకి వచ్చే వారికి ఇక్కడకు వచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. గవర్నర్ కార్యదర్శిగా ప్రస్తుతం గిరిజన సంక్షేమ కార్యదర్శిగా ఉన్న ముఖేష్ కుమార్ మీనాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

చరిత్ర సృష్టించిన ప్రకాశం పోలీస్

- జిల్లాలోని పోలీసుస్టేషన్లు వీడియా కాన్ఫరెన్స్‌కు అనుసంధానం
- ఇందుకు కోసం ఒక్కో పోలీసుస్టేషన్‌కు ఖర్చు కేవలం రూ.2,100
- జిల్లాలో శనివారం ప్రయోగాత్మకంగా ట్రయల్ రన్
- రెండుమూడు చోట్ల మినహా అన్నింటా భేష్
- ప్రకాశం ఐటీ వింగ్‌కు గుంటూరు రేంజి ఐజీ ప్రశంసలు

రాజధాని వార్తలు, ఒంగోలు : ప్రకాశం పోలీసులు సరికొత్త చరిత్ర సృష్టించారు. ఏజెన్సీలతో సహా అన్ని పోలీసుస్టేషన్లు వీడియో కాన్ఫరెన్స్‌కు అనుసంధానం చేశారు. అది కూడా కేవలం రూ.2,100 ఖర్చుతో. ఒక్కో స్టేషన్‌ను వీడియో కాన్ఫరెన్స్‌కు అందుబాటులోకి తెచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌ను సిస్టంకు మాత్రమే కాకుండా ఆండ్రాయిడ్ మొబైల్, ల్యాప్‌టాప్‌కు సైతం అందుబాటులోకి తెచ్చారు. శనివారం ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఈ ట్రయల్ రన్ విజయం సాధించడంతో పలు జిల్లాల ఎస్పీలు సైతం అందుబాటులోకి వచ్చి ఈ ప్రక్రియను తమ జిల్లాలో సైతం అమలు చేసేందుకు జిల్లా పోలీస్ శాఖ సహకారాన్ని కోరారు.

ఇవీ.. ఉపయోగాలు

- పోలీసు శాఖ ఇప్పటి వరకు సెట్ కాన్ఫరెన్స్ పైనే ఎక్కువుగా ఆధారపడుతుండేది. డైలీ స్టేషన్ రిపోర్టుకు సంబంధించిన అంశాలతో నేరుగా ప్రతి రోజు ఉదయం మాట్లాడడం రివాజు. ఈ క్రమంలో అధికారులు సెట్‌లో చెప్పేదానికి, అదే విధంగా ఫోన్‌లో మాట్లాడుతున్నా నేరుగా వారితో మాట్లాడేటప్పుడు ఉండే ఫీలింగ్‌కు మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. అధికారి నేరుగా కనిపించినప్పుడు వారికి అవసరమైతే స్పష్టమైన సూచనలు చేసే అవకాశం ఉంటుంది. ఇప్పుడు వీడియో కాన్ఫరెన్స్ అందుబాటులోకి రావడం ద్వారా అధికారులంతా ఒకేసారి అందుబాటులోకి రావడం ద్వారా ఉన్నతాధికారులు జారీ చేసే ఆదేశాలను సైతం క్షణాల్లో అవతలి అధికారులకు వేగవంతంగా పంపే అవకాశం లభించినట్లయింది
- ఒక వేళ అధికారి అందుబాటులో లేకపోతే ఆ అధికారి తన వద్ద ఉన్న ల్యాప్ ట్యాప్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఇంకా ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్నా దీంతో కూడా ఎస్పీ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనే సౌలభ్యం ఉంది.
- ఎక్కడైనా పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతున్నా లేక ఎవరైనా ముఖ్యమైన వ్యక్తులు వస్తే వారి కార్యక్రమాన్ని ఎస్పీ తన కార్యాలయంలోనే ఉండి నేరుగా అక్కడ ఏం జరుగుతుందనేది ఎస్పీ వీక్షించేందుకు అవకాశం ఏర్పడింది. అంతే కాకుండా అప్పటికప్పుడు అవసరమైన సూచనలు, సలహాలను కూడా ఎస్పీ జారీ చేసేందుకు సౌలభ్యం ఉంది.
- వాస్తవానికి ఇప్పటి వరకు దోర్నాల, పెద్దారవీడు, కంభం, పుల్లలచెరువు, సీఎస్‌పురం పోలీసుస్టేషన్ల పరిధిలోని ఎస్ఐలతో ఎస్పీ నేరుగా మాట్లాడటమంటే వారు నేరుగా ఎస్పీ కార్యాలయానికి వచ్చినప్పుడో లేక ఎస్పీ సంబంధిత స్టేషన్లకు వెళ్లినప్పుడో జరిగేది. దీని ద్వారా ఇరువరి మధ్య ముఖాముఖి కనీసం 6 నెలలుకుపైగా పడుతుందని పోలీసుశాఖలోనే అంచనా. అటువంటిది అవసరమనుకుంటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్షంగా నేరుగా సంబంధిత అధికారితో ఎస్పీ మాట్లాడే అవకాశం ఏర్పడింది.
- ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమాన్ని ప్రతి సోమవారం ప్రజలకు, ప్రతి శుక్రవారం సిబ్బందికి ఎస్పీ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లేదా డీజీపీ లేదా ఐజీలు నేరుగా ఏ అధికారితో అయినా కనెక్ట్ అయ్యే అవకాశం ఏర్పడింది. నేరుగా సంబంధిత అధికారితో మాట్లాడటం ద్వారా సమస్యను అత్యంత వేగవంతంగా పరిష్కరించేందుకు అవకాశం ఏర్పడుతుంది. అంతే కాకుండా ఈ ప్రక్రియ ద్వారా సిబ్బందిలో బాధ్యత కూడా పెరుగుతుందని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు.
- ఉదాహరణకు కలెక్టరేట్ వద్దే వందలాది మంది ప్రజానీకం వచ్చి ధర్నాలు చేస్తుంటే అవసరమైన పక్షంలో అదనపు బలగాలను పంపించే అవకాశం ఏర్పడుతుంది. ఏఆర్ సిబ్బందిని కూడా ముందుగానే పెద్ద ఎత్తున పంపేకంటే అక్కడ ఉన్న పరిస్థితిని అంచనా వేసుకుంటూ ఎంతమందిని పంపాలనే దానిపై నిర్ణయం తీసుకునే వీలుంటుంది.

నేడే చంద్రయాన్-2



రాజధాని వార్తలు, సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 22న మధ్యాహ్నం 2.43 గంటలకు ప్రయోగించనున్న చంద్రయాన్-2 ప్రయోగాన్ని వీక్షించేందుకు సందర్శకుల కోసం విలక్షణమైన గ్యాలరీని షార్ అధికారులు నిర్మించారు. తొలుత ఈ నెల 15వ తేదీ తెల్లవారుజామున చంద్రయాన్-2 ప్రయోగానికి సిద్ధం చేశారు. ఈ ప్రయోగం ఇస్రోకే ప్రతిష్టాత్మకం కావడంతో ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు దేశా వ్యాప్తంగా పౌరులను ఆహ్వానించింది.

వీరి కోసం షార్‌లోని శబరి గిరిజన కాలనీ ప్రాంతంలో సుమారు 60 ఎకరాల అటవీ భూమిలో సుమారు 5 వేల మంది సందర్శకులు కూర్చుని రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు వీలు కల్పిస్తూ గ్యాలరీ నిర్మాణం చేపట్టారు. ఈ తరహా గ్యాలరీ నిర్మాణాన్ని సైతం షార్ ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. అయితే ప్రయోగానికి గంట వ్యవధిలో సాంకేతిక కారణాలతో కౌంట్ డౌన్ ప్రక్రియను నిలిపివేసిన విషయం తెలిసిందే.

ఆహ్వానితులకు మళ్లీ అవకాశం

ఈ నెల 15న ప్రయోగం నిర్వహించతల పెట్టినప్పుడు సందర్శకులు దేశంలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇస్రో వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకుని ఆ పాస్‌లతో రాకెట్ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా తిలకించాలని ఎన్నో ఆశలతో వచ్చారు. అర్ధరాత్రి వేళ అని చూడకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ప్రయోగం వాయిదా పడడంతో నిరుత్సాహంగా వెనుదిరిగి వెళ్లిపోయిన విషయం తెలిసిందే.

అందుకే వారిని సంతృప్తి పరిచేందుకు గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వాళ్లకు ఇచ్చిన సీరియల్ నంబర్‌లో వెబ్‌సైట్‌లో కొడితే అనుమతి వస్తోంది. కొత్తగా రావాలనుకునే వారికి మాత్రం సైట్ ఓపెన్ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కొత్త వారికి కూడా చంద్రయాన్-2 ప్రయోగాన్ని వీక్షించే భాగ్యాన్ని కల్పించాలని పలువురు సందర్శకులు కోరుతున్నారు.

సదా ప్రజల సేవకుడినే

రాజధాని వార్తలు, నెల్లూరు (సెంట్రల్) : ప్రజలకు సదా సేవకుడిలా పనిచేస్తానని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని 9వ డివిజన్ ప్రాంతంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఇరిగేషన్ మంత్రి పి.అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం ఎంపీ వేమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 36 మండలాల్లో 88 వాటర్ ప్లాంట్లు ప్రజల అవసరార్థం వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమం ముందుకుతుందన్నారు.

తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న గ్రామాలకు వీపీఆర్ ఫౌండేషన్ ఎప్పుడూ చేయూతనిస్తుందని తెలిపారు. చిన్న వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చిన అనిల్‌కుమార్ ఎల్లవేళలా ప్రజల మధ్యనే ఉంటూ సేవలందిస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అనిల్‌కుమార్‌కు కీలకమైన మంత్రి పదవి ఇచ్చారని అన్నారు. అనంతరం మంత్రి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని, ఎక్కడ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అడిగినా కాదనకుండా ఏర్పాటు చేస్తున్న ఆయన అపర భగీరథుడని కొనియాడారు.

సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా..

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా కోటేశ్వరరావు

రాజధాని వార్తలు, విశాఖ : విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి పులిపాటి కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2009 కేడర్‌కు చెందిన కోటేశ్వరరావు ఏపీపీఎస్ కార్యదర్శిగా, కడప, పశ్చిమ గోదావరి జిల్లాల జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన వెయిటింగ్ జాబితాలో ఉన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా ఉన్న బసంత్‌కుమార్ టీటీడీ జేఈవోగా బదిలీ కాగా.. ఇన్‌చార్జి కమిషనర్‌గా ప్రస్తుతం జీవీఎంసీ కమిషనర్ జి.సృజన వ్యవహరిస్తున్నారు.

సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా..

సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా రానున్న కోటేశ్వరరావు తెలిపారు. చైర్మన్, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయంతో వీఎంఆర్‌డీఏను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. సంస్థను వివాదరహితంగా, పారదర్శకంగా నడిపించడమే తమ ధ్యేయమని అన్నారు.

నీటి కేటాయింపులకు చట్టబద్ధత కల్పించాలి

రాజధాని వార్తలు, వైఎస్సార్ జిల్లా : వెలిగొండ, గాలేరు నగరి, తెలుగు గంగ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పెంచాలని రాయలసీమ ఉద్యమ నేత, కార్మిక కర్షక సమితి అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ జిల్లాలో ఆయన మాట్లాడుతూ 'నిత్యం కరువు కాటకాలను ఎదుర్కొనే రాయలసీమ జిల్లాలకు గోదావరి జలాలను ఎక్కడి నుంచి తరలించినా మాకు సమ్మతమే. దీనిపై అనవసర రాజకీయాలు తగదు.

ఆంధ్ర ప్రాంతం నుంచి వస్తున్న విమర్శల నేపథ్యంలో, శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం ముందు రాయలసీమ అవసరాలు తీరాక కింది ప్రాంతాలకు వదలాలి. ఇప్పటికే రాజధాని, హైకోర్ట్, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులన్నీ కోస్తాకే తరలించారు. కనీసం కరువు సీమకు నీళ్లిచ్చే విషయంలో అయినా రాజకీయాలు కాకుండా మానవతా కోణంలో ఆలోచించండి. కృష్ణా, గోదావరి జలాల విషయంలో రెండు రాష్ట్రాలు చేసుకునే ఒప్పందాలకు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ద్వారా చట్టబద్ధత కల్పించాలి. తెలంగాణాతో మాట్లాడి 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించాలని కోరారు.

కేశినేనికి పీవీపీ నోటీసులు

రాజధాని వార్తలు, అమరావతి : పట్టువదలని విక్రమార్కుడు పివిపి మూడు వందల కోట్ల మేరకు అతి పెద్ద పరువునష్టం దావా వేయబోతున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయవాడ నుంచి పివిపి పోటీచేసారు. ఆ సమయంలో ఆయనకు ప్రత్యర్థిగా పోటీ చేసిన కేశినేని నాని ఈయనపై పలు ఆరోపణలు చేసారు. వాటిని వివిధ మాధ్యమాలు ప్రసారం చేసాయి. కొన్ని మాధ్యమాలు ప్రత్యకంగా ప్రస్తావించాయి. ఇప్పుడు ఈ విషయంపై పివిపి ఓ నోటీసును కేశినేని నానికి ఇచ్చారు. రూల్స్ ప్రకారం ఈ నోటీస్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇది ఇచ్చి, రూల్స్ ప్రకారం టైమ్ గ్యాప్ ఇచ్చి పరువునష్టం దావా వేయబోతున్నట్లు విశ్వసనీయ వర్గాల బోగట్టా. ఆ దావా కూడా కేవలం కేశినేని మీద కాకుండా, టీవీ 5, మహా టీవీల మీద, కలిపి, వందేసి కోట్ల వంతున మొత్తం రూ.300 కోట్లకుపరువు నష్టం దావా వేయబోతున్నట్లు తెలుస్తోంది. తొలిసారి మీడియా సంస్థల మీదే కాకుండా, అవి ప్రసారం చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్న అందరి పైనా కూడా దావా వేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో తాను వెనక్కు తగ్గేది లేదని, పివిపి చెబుతున్నట్లు బోగట్టా. బహుశా ఆగస్టు రెండోవారంలో ఈ పరువునష్టం దావాలు వేస్తున్నట్లు తెలుస్తోంది.

"రాజధాని వార్తలు" దినపత్రికకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టలను నియమిస్తున్నాం ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించండి.
సెల్ : 9440662699,
rajadhanivartalu@gmail.com

యధేచ్ఛగా బెట్టింగ్ మాఫియా!

- బెట్టింగ్ ముఠా వలలో జిల్లా యువత
- గ్రామాలకు పాకిన జాడ్యం

రాజధాని వార్తలు, శ్రీకాకుళం : బెట్టింగ్ మాఫియా కన్ను పట్టణాలు, పల్లెలపై పడింది. మెట్రో నగరాల్లో వీరి కార్యకలాపాలకు అక్కడ పోలీసు యంత్రాంగం చెక్ పెడుతుండటంతో ఇటువైపు దృష్టిసారించింది. ఇటీవల శ్రీకాకుళం, రాజాంలో బయటపడిన బెట్టింగ్ బాగోతాలే ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ఇక్కడ యువతలో క్రికెట్ మోజును బలహీనతగా చేసుకున్న ఓ ముఠా ప్రత్యేక యాప్ ద్వారా బెట్టింగ్ రొంపిలోకి దించుతోంది. దీంతో ఆర్థికంగా చితికిపోయి జీవితాలను నాశనం చేసుకునే స్థితికి దిగజార్చుతోంది. రాజాంలో గుట్టుగా సాగిస్తున్న బెట్టింగ్ వ్యవహారాన్ని ఇటీవల పోలీసులు రట్టు చేశారు. ప్రపంచకప్ సెమీఫైనల్ -2 మ్యాచ్ సందర్భంగా ఐదుగురు బెట్టింగ్ రాయుళ్లను ఈ నెల 11న అదుపులోకి తీసుకోగా, పరారైన మరో ఐదుగురిని ఈనెల 17న అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ. 5.05 లక్షలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసిన విషయం విదితమే.

యువతే టార్గెట్.....

ప్రస్తుతం యువత ప్రపంచీకరణ మోజులోపడింది. డబ్బులు ఈజీగా సంపాదించే ఆలోచనలోనే బెట్టింగ్ ముఠా వలలో చిక్కుతోంది. ఇదే అదునుగా చేసుకుని వందకు వెయ్యి, వెయ్యికి పది వేలు, రూ. పది వేలకు రూ.లక్ష అంటూ పదింతలు సంపాదించవచ్చునని ఆశపెడుతోంది. మ్యాచ్ ఏదైనా బెట్టింగ్ మాత్రం ఒకటే. ముందుగానే ఇటువంటి బలహీనత యువతను గుర్తించి వారి ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడడం వంటివి చేస్తుండడం గమనార్హం. ఒక్క రాజాంలోనే కాకుండా జిల్లా అంతటా ఇదే తంతు సాగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కొంతమంది యువత విలువైన వస్తువులతోపాటు బైక్‌లను, ల్యాప్‌టాప్‌లను కుదవపెట్టి బెట్టింగ్‌లకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఒకప్పుడు ఎక్కడో పెద్ద పట్టణాల్లో సాగిన బెట్టింగ్ చిన్న పట్టణాలకు పాకడంతో విజ్ఞులు నిట్టూరుస్తున్నారు.

కాదేదీ బెట్టింగ్‌కు అనర్హం...

బెట్టింగ్ రాయుళ్లు ఉచ్చులో చిక్కుకున్న యువత రంజీ, ఐపీఎల్, టీ20, వన్డే మ్యాచ్‌లతోపాటు టీవీల్లో వచ్చే లైవ్ మ్యాచ్‌లకు బెట్టింగ్‌కు పాల్పడుతోంది. ఈ బెట్టింగ్‌ల్లో బాల్ టూ బాల్, ఓవర్ టూ ఓవర్, బ్యాటింగ్, వికెట్లు, సిక్సర్స్, ఫోర్స్ వంటి వాటిపై కూడా ఉత్కంఠగా బెట్టింగ్ కాయడం. ఒకవేళ చేతిలో సొమ్ములు అయిపోతే వారి వద్ద ఉన్న గోల్డ్, ఇతర విలువైన వస్తువులు కూడా పద్దు రూపంలోను, అమ్మకం చేసో పోగొట్టుకున్న సొమ్మును రాబెట్టుకునేందుకు బెట్టింగ్‌లవైపు ఆకర్షితులవుతున్నారు. దీంతో ఆర్థికంగా చితికిపోయి ఎక్కువ వడ్డీకి అప్పులు చేయడం, పరారైపోవడంతో కుటుంబాలను ఛిద్రం చేసుకుంటున్నారు. ఒకవేళ బెట్టింగ్ స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించే సమయంలో కేవలం సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కొద్ది మొత్తంలో సొమ్ము మాత్రమే దొరుకుతోంది. కోట్లలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నప్పటికీ ఎవరికీ దొరకుండా జాగ్రత్త పడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

అంతా యాప్‌లోనే....

క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించి యాప్‌ల ద్వారా సాగిస్తున్నారు. యాప్ ద్వారా రేటింగ్స్ ముందుగానే లెక్కించి ఏ జట్టుకు బెట్టింగ్ కాస్తే లాభదాయకంగా ఉంటుందో తెలియజేసి, తదనుగుణంగా బెట్టింగ్‌లోకి దించుతున్నారు. దీనికి సంబంధించి లాగిన్ ఐడీ ఇచ్చి ముందుగానే డిపాజిట్ కూడా చేయిస్తున్నారనే విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదంతా విజయవాడ కేంద్రంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. దీనికి గాను బెట్టింగ్ నిర్వాహకులు భారీగానే ఆర్జిస్తున్నారు. బెట్టింగ్‌లో రెండు వైపుల నుంచి కూడా వీరికి భారీస్థాయిలో కమీషన్ అందుతున్నట్లు తెలుస్తోంది.

అంతా గోప్యంగానే.....

బెట్టింగ్ రాయుళ్లు ఎవరి కంటా పడకుండా అంతా గోప్యంగానే సాగిస్తున్నారు. నలుగురిలో తిరుగుతూ పక్కవాడికి కూడా అనుమానం రాకుండా జాగ్రత్త పడుతున్నారు. దీనికోసం శివార్లలో ఇళ్లను ఎంపిక చేసుకుంటున్నారు. అలాగే లాడ్జీల్లో రూమ్‌లు తీసుకుని బెట్టింగ్ గుట్టుగా సాగిస్తున్నారు. అంత వరకు సామాన్యుడిలా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా లైఫ్‌స్టైల్ మార్చడం, కొన్ని రోజులకే పూర్వ స్థితికిరావడం తర్వాత ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోవడం, పలుచోట్ల సంభవిస్తున్నాయి. అయితే రాజాంలో కలకలం రేపిన బెట్టింగ్ వ్యవహారంలో పది మంది మాత్రమే ఇప్పటివరకు పట్టుబడ్డారు. వీరు మాత్రమేనా ఇంకా ఎవరైనా ఉన్నారా అన్నది పట్టణంలో గుసగుసలాడుకుంటున్నారు. దీనిని మొగ్గలోనే తుంచి ఈ భూతాన్ని తరిమివేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

రాజధాని వార్తలు కలం

రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత

ఆంధ్రప్రదేశ్ రాజధాని నగర నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదే..ఇది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటుసాక్షిగా ఇచ్చిన వాగ్దానం. ఇదే విషయాన్ని కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం కూడా చెబుతోంది. 2014 ఏప్రిల్ 30న తిరుపతిలో మోడీ ఎన్నికల ప్రసంగం చేస్తూ"మీ మనసులో బాధ ఉందని తెలుసు. హైదరాబాద్ లేదనీ, ఏం చేయగలమనీ ఆలోచన ఉండడం సహజం.. భవిష్యత్తుపై బెంగ ఉంది.. మీకు మాటివ్వడానికి భరోసా కల్పించడానికి వచ్చాను... తూర్పు దేశాలతో వాణిజ్య కేంద్రంగా కోస్తా తీరాన్ని తీర్చిదిద్దుతా.. చంద్రబాబు కొత్త రాజధాని ఎలా కట్టాలంటే, దాని ముందు ఢిల్లీ కూడా చిన్నబోవాలి. ప్రపంచంలోని గొప్ప నగరాలను అధ్యయనం చేసి వాటి కంటే మంచిది కట్టి భారతదేశానికి ఆదర్శంగా చూపండి... మీరు అసెంబ్లీ, పార్లమెంటులో మమ్మల్ని గెలిపించండి. ఆంధ్రకు ఇచ్చిన హామీలన్నీ తీర్చే బాధ్యత మాది." అన్నారు. 2014 మే 1న నెల్లూరులో "ఆంధ్రకు స్పెషల్ స్టేటస్ ప్యాకేజి వచ్చిందంటే రాజ్యసభలో పోరాడిన... మీ నెల్లూరులో పుట్టిన వెంకయ్య నాయుడు వల్లే. మాటిస్తున్నాను. మాపై నమ్మకం ఉంచి ఢిల్లీలో కూర్చోబెట్టండి... ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా, మరింత ఎక్కువగా మేలు చేసి చూపిస్తాం." అని, 2015 సెప్టెంబరు 22న అమరావతి శంకుస్థాపనలో కూడా "నేను మీకు నమ్మకంగా చెప్తున్నాను. పునర్విభజన చట్టంలోని హామీలన్నీ నెరవేర్చి తీరుతామని ఈ అమరావతి సాంస్కృతిక నగరి సాక్షిగా చెబుతున్నాను. ఈ మోడీ-బాబు జోడీ అభివృద్ధి చేస్తుంది. అభివృద్ధిలో అమరావతి ఢిల్లీతో కలసి నడుస్తుంది." అన్న ప్రధాని మోడీ మాటలు ఏమయ్యాయి?

ప్రధాని మోడీ తన ఎన్నికల హామీని నెరవేర్చడానికి రాష్ట్రం నుంచి కేంద్రపై ఒత్తిడి పెంచాల్సింది పోయి .. ప్రపంచ బ్యాంకు అప్పు ఇవ్వనంటోంది. ఇది ప్రస్తుత ప్రభుత్వ నిర్వాకమే.. అని ప్రతిపక్షాలు ప్రజలను గందరగోళానికి గురిచేయడం సరికాదు. కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం , ఆంధ్రులను మరింత అద: పాతాళానికి తొక్కడం ఏమాత్రం సమర్థనీయం కాదు. అమరావతికి రుణం ఇచ్చే ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రపంచ బ్యాంకును కోరింది కేంద్ర ప్రభుత్వమే అన్నది కూడా వెలుగులోకి వచ్చింది. రుణ మంజూరుకు సంబంధించి ప్రపంచ బ్యాంకు పలు అంశాలను లేవనెత్తిన నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు ఈ విజ్ఞప్తి చేసిందని తెలుస్తోంది... అమరావతికి రుణం విషయంలో భారత ప్రభుత్వమే తన విజ్ఞప్తిని వెనక్కు తీసుకుందని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి సుదీప్ ముజుందార్ కూడా స్పష్టం చేశారు. దీని భావం ఏమటి ? రాజధాని విషయంలో ప్రజాభిప్రాయానికి భిన్నంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని కొందరు రైతులు 2017 మే 25న ప్రపంచబ్యాంక్ ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. 2017 సెప్టెంబర్ లో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటించింది. ఆ సమయంలో ల్యాండ్ పూలింగ్ విధానంపై అభ్యంతరాలతో పాటు సమర్థిస్తున్న రైతులు కూడా ప్రపంచబ్యాంక్ ప్యానెల్ బృందాన్నికలిశారు. ఏపీ ప్రభుత్వ అధికారులు కూడా ప్రపంచబ్యాంక్ బృందం ముందు తమ వాదన వినిపించారు. అనంతరం జరిగిన పరిణామాలతో చివరకు తాజాగా ప్రాజెక్ట్ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రపంచ బ్యాంక్ తేల్చి చెప్పడం గమనార్హం.

కేంద్రం తన బాధ్యతలను విస్మరించడంతోపాటు, కరెంటు పీపీఏల ద్వారా ఐదేళ్లలో 12 వేల కోట్లరూపాయలు ప్రజా ధనం నష్టపోయామని దానిపై సమీక్షించాలని జగన్ ప్రభుత్వం భావిస్తున్నా.. అనుమతించకపోవడం .. ప్రజలను విస్తుపోయేలా చేయడంతోపాటు ఈ అవినీతిలో కేంద్రానికీ భాగస్వామ్యం ఉందా అన్న సందేహాన్ని కలిగిస్తోంది. ఇప్పటికే ఉత్తరభారతంలోని బీజేపీ ప్రభుత్వాలకు, దక్షిణభారతంలోని ప్రాంతీయ, బీజేపీయేతర పార్టీల పాలనకు మధ్య చాలా అంతరం కొనసాగుతోంది. ఇదిలా కొనసాగితే.. బీజేపీ.. ప్రతిపక్షాలు మరింత ప్రజలకు దూరమవుతాయి. ఇప్పటికే ప్రతి ఆంధ్రుడి తలపై రూ. 1 లక్ష అప్పు ఉంది.. ఈ దశలో మళ్లీ అప్పుచేసి పప్పుకూడా తినాల్సిన అవసరం లేదు.. రాజ్యాంగబద్ధంగా మనకు రావాల్సిన వాటిని ఆంధ్రులంతా ఒక్కటై సాధించుకోవాలి.



'అన్యాయం జరిగితే నన్ను కలవండి'

రాజధాని వార్తలు, అమరావతి : రవాణాశాఖలో ప్రమోషన్లు, బదిలీలు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని, ఎవరికైనా అర్హత ఉండి అన్యాయం జరిగితే నేరుగా తనను కలవొచ్చని ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి పేర్ని నాని అన్నారు. ఇకపై నెలలో ఓ శుక్రవారం రవాణా ఉద్యోగుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వ్యవస్థల్లో అవినీతిపరులు ఉన్నారని, అంతమాత్రాన వ్యవస్థ మొత్తానికి అవినీతిని ఆపాదించడం సరికాదన్నారు. ఏపీలో ఆదాయం తెచ్చే శాఖల్లో రవాణా శాఖ నాలుగో స్థానంలో ఉందని చెప్పారు.గతంలో పోలిస్తే ఆటో ప్రమాదాల సంఖ్య కొంతవరకు తగ్గాయని తెలిపారు. ద్విచక్ర వాహనాల ప్రమాదాలు, మరణాలు బాగా పెరిగాయన్నారు. రోడ్ల మీద ఇష్టం వచ్చినట్లు వాహనాలు తోలుతూ.. ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఇటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టామని, దీనిపై అధికారుల్లో ప్రజల్లో అవగాహనా కల్పించాలని, జాతీయ రహదారిపై డ్రంకెన్ డ్రైవ్ ను విస్తృతం చేయాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని స్కూల్ బస్సులను సీజ్ చేశామని, రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు.

అవినీతి అంతా బయటకు తీస్తాం: చీఫ్ విప్

రాజధాని వార్తలు, వైఎస్సార్ : ఆంధ్రప్రదేశ్‌ని అవినీతి రహిత రాష్ట్రంగా రూపుదిద్దడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా శ్రమిస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో వ్యవస్థలన్నీ పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని.. వాటిన్నింటినీ ప్రక్షాణళ చేయాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రతి అంశాన్ని టీడీపీ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రతిపక్షానికి కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, కానీ తమ ప్రభుత్వంలో కావాల్సినంత సమయం ఇస్తున్నామని తెలిపారు. టీడీపీ హయాంలో జరిగిన అవినీతి అంతా త్వరలోనే బయటకు తీస్తామని ఆయన హెచ్చరించారు.

సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "గత ఐదేళ్లలో రాష్ట్రం అవినీతి మయంగా మారింది. రూ.2.7 వేల కోట్ల అప్పుల భారం ప్రజలపై మోపారు. లక్ష కోట్ల వరకు పనులు పెండింగ్‌లో పెట్టారు. వ్యవస్థలను క్రమబద్ధీకరించే బాధ్యత సీఎం వైఎస్ జగన్‌పై పడింది. క్రింది స్థాయి నుంచి రెవిన్యూ, పోలీసు, సంక్షేమ పథకాలు, కాంట్రాక్టు వంటి వ్యవస్థలో అవినీతి లేకుండా చేస్తాం, అవినీతి నిర్మూలన కోసం మీడియా సహకారం ఎంతో అవసరం. సంక్షేమ కార్యక్రమాల ద్వారా మాత్రమే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయుటకు అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టం తీసుకురాబోతున్నాం. ఎప్పుడు లేని విధంగా వారికి 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నాం. ప్రైవేటు స్కూల్స్ దోపిడిని నివారించేందుకు ఫీజు రెగ్యులేటరీ చట్టాన్ని తీసుకురాబోతున్నాం. అసెంబ్లీ సమావేశాల్లో పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా 20 బిల్లులు ప్రవేశపెట్టాం. ఇంటింటికి కుళాయి ఇవ్వడానికి రివర్స్ టెండరింగ్ వేస్తున్నాం. ఉగాదికి లోపల 25 లక్షల మంది నిరుపేదలకు సొంత ఇంటికల నిజం చేస్తాం. 130 కోట్లతో రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాల్లో సీపీ రోడ్లు మంజూరుచేశాం" అని అన్నారు.

నారాయణ కాలేజీ నిర్లక్ష్యం...విద్యార్థులకు శాపం

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- నారాయణ ఆస్పత్రిలో చికిత్స

రాజధాని వార్తలు, నెల్లూరు : నెల్లూరు అరవిందనగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాల్లో శనివారం గోడ కూలి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు ఆరుగురు గాయాలపాలయ్యారు. ఉదయం 11 గంటల సమయంలో వాష్‌రూంకు వెళుతున్న సమయంలో ఈ సంఘటన చేసుకుంది. అదృష్టవశాత్తు విద్యార్థులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. గోడ కూలిన సమయంలో ఎంపీసీ విద్యార్థులు గిరీష్, కృష్ణవంశీ, వర్షిత్, లీలేష్, జశ్వంత్, వంశీచైతన్య వాష్‌రూంకు వెళుతుండగా గోడ కూలింది. దీంతో గిరీష్, వంశీచైతన్య, జశ్వంత్‌కు తల, కాళ్లు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన జరిగిన తరువాత కళాశాల యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా గాయపడిన విద్యార్థులను హుటావుటిన ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రిలోకి ఎవరిని వెళ్లకుండా సెక్యూరిటీని టైట్ చేశారు. విద్యార్థులు కూడా తరగతులకు వెళ్లకుండా ఇంటికి వెళ్లిపోయారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. ఈ నేపథ్యంలో నారాయణ కళాశాల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఏం జరిగిందోనని ఆందోళనకు గురయ్యారు. కళాశాల యాజమాన్యం మాత్రం ఒక్కసారిగా విద్యార్థులు వచ్చి గోడపై పడడంతోనే గోడ కూలిందని బుకాయిస్తున్నారు. అయితే నారాయణ కళాశాల్లో గోడ కూలిన సంఘటను చిన్నబజారు పోలీసుస్టేషన్లో కేసు నమోదు చేయనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. నారాయణ జూనియర్ కళాశాల్లో జరిగిన సంఘటనను ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్, ఆర్ఐఓ తదితర అధికారులు పరిశీలించారు.

తానా ఫౌండేషన్ చైర్మన్‌గా నిరంజన్ మరోసారి ఎన్నిక

రాజధాని వార్తలు, వాషింగ్టన్ : అమెరికాలో స్థిరపడిన, అమెరికాలో పనిచేస్తున్న ఎన్నారైల సంక్షేమం కోసం కృషిచేస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) క్రమంగా విశేష ఆదరణ పొంది తెలుగు రాష్ట్రాల్లోని సామాన్యులకు కూడా 'తానా ఫౌండేషన్' పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపన్నహస్తం అందిస్తున్న విషయం తెలిసిందే. ఆ విభాగానికి చైర్మన్‌గా శృంగవరపు నిరంజన్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ఈ పదవిలో ఆయన మరో రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్నారు. రాబోయే రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విద్య, ఆరోగ్య రంగంలో ఉత్తమ సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతామని నిరంజన్ వెల్లడించారు. అలాగే అమెరికాలో తెలుగు భాషకు, తెలుగు సంస్కృతుల పరిరక్షణకు కృషిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎంతోకాలంగా తానా ప్రజలకు చేస్తున్న సేవలకు మొన్నటి తానా మహాసభలకు వచ్చిన విశేష స్పందనే నిదర్శనమని ఆయన అన్నారు. తనకు ఈ కీలక బాధ్యతలు అప్పగించిన తానా ప్రముఖులు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తానా అధ్యక్షులు జయశేఖర్, మాజీ అధ్యక్షులు సతీష్ వేమన, గంగాధర్ నాదెళ్ల, జయరాం కోమటిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వెనకబడిన జిల్లాల్లో ఎక్కువగా తానా కార్యక్రమాలు నిర్వహించనుందని వెల్లడించారు.

6 రాష్ట్రాలకు నూతన గవర్నర్లను నియమించిన కేంద్ర ప్రభుత్వం!

- ఇటీవల ఏపీ గవర్నర్ గా హరిచందర్ నియామకం
- యూపీ గవర్నర్ గా ఆనందీబెన్ పటేల్

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ గవర్నర్ గా బిశ్వభూషణ్ హరిచందర్ ను ఇటీవల నియమించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా మరిన్ని రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించింది. ఉత్తరప్రదేశ్ గవర్నర్ గా బీజేపీ నేత, మాజీ సీఎం ఆనందీబెన్ పటేల్ ను నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది. ఇక పశ్చిమబెంగాల్ గవర్నర్ గా జగదీప్ ధన్ఖర్, త్రిపుర గవర్నర్ గా రమేశ్ బయాస్, నాగాలాండ్ గవర్నర్ గా ఆర్ఎన్ రవిని నియమిస్తున్నట్లు తెలిపింది.అలాగే బిహార్ గవర్నర్ గా పగూ చౌహాన్, మధ్యప్రదేశ్ గవర్నర్ గా లాల్జీ టాండన్ ను నియమిస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్ గవర్నర్ గా ఉన్న ఆనందీబెన్ బెన్ పటేల్ ఉత్తరప్రదేశ్ కు బదిలీపై వెళుతున్నారు.

సీఎం జగన్ నిర్ణయం సంతోషాన్ని కలిగించింది

రాజధాని వార్తలు, విశాఖపట్నం : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విశాఖలో జరపాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందని మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆంధ్రా యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి అవంతి శ్రీనివాస్.. స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల నిర్వహణకు అనుకూలమైన మైదానాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఏయూ ఇంజినీరింగ్ మైదానం, బీచ్ రోడ్ ఈ రెండు ప్రదేశాలను పరిశీలించి, వీటిలో అనుకూలమైనది ఎంపిక చేస్తామని చెప్పారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రతిపక్షానికి ఎక్కువ సమయం ఇచ్చి అసెంబ్లీ నిర్వహణ అద్భుతంగా జరుగుతోందన్నారు. ప్రతిపక్ష శాసన సభ్యులు ఉన్న నియోజకవర్గాలకు త్రాగునీటి కోసం కోటి రూపాయలు నిధులు వైసీపీ ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు.

జనసేన న్యాయ విభాగం సమన్వయకర్తగా ప్రతాప్ నియామకం



రాజధాని వార్తలు, అమరావతి : జనసేన పార్టీ వ్యవస్థాగత నిర్మాణంలో భాగంగా మరో కీలక నియామకం జరిగింది. పార్టీ న్యాయ విభాగం సమన్వయకర్తగా సీనియర్ అడ్వొకేట్ సాంబశివ ప్రతాప్ ను నియమించారు. ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాలకు ప్రతాప్ పార్టీ తరఫున లీగల్ కోఆర్డినేటర్ గా వ్యవహరించనున్నారు. ప్రతాప్‌కు హైకోర్టు స్థాయి న్యాయవాదిగా ఎంతో గుర్తింపు ఉంది. జనసేన లీగల్ వింగ్ కోఆర్డినేటర్ గా ప్రతాప్ ను నియమిస్తూ ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆమోద ముద్ర వేశారు. ఎంతో అనుభవం ఉన్న ప్రతాప్ జనసేనకు మెరుగైన సేవలు అందిస్తారని ఆశిస్తున్నట్టు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు జనసేన పార్టీ నుంచి ప్రకటన వెలువడింది.

సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన విలాయత్ ఆలీ.

'2024లో ఏపీలో బీజేపీదే అధికారం'



రాజధాని వార్తలు, గుంటూరు : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కులాలు బాగా ప్రభావితం చేస్తున్నాయని, కుటుంబ పాలన కొనసాగుతోందని బీజేపీ నేత సునీల్ దియోధరన్ విమర్శించారు. ఆదివారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ 2024లో ఏపీలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జన్మభూమి కమిటీలకు మరో పేరు గ్రామ వాలంటీర్లని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. కేంద్ర పథకాలను రాష్ట్రాలు వారికి నచ్చి.. వేరే పేర్లతో అమలు చేస్తూ.. అవినీతికి పాల్పడుతున్నాయని ఆరోపించారు.

జంగారెడ్డిగూడెం డిఎస్పీగా స్నేహిత

రాజధాని వార్తలు, కాకినాడ : స్నేహిత స్వస్థలం కాకినాడ..అక్కడే ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. గ్రాడ్యూయేషన్ పూర్తి చేసిన తర్వాత పోలీస్ శాఖలో చేరారు.. సైబరాబాద్, తెనాలి డిఎస్పీగా పని చేసిన స్నేహిత చెరగని ముద్ర వేశారు.షీ టీమ్, సబల ప్రాజెక్టులన సమర్ధవంతంగా అమలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు..మహిళల రక్షణపై ప్రత్యేక జాగ్రత్తలు, చర్యలు తీసుకోవడం ఆమె ప్రత్యేకత. మెట్ట ప్రాంతంలో ఫోక్సో కేసులు, మహిళల హత్యలు, ఆత్మహత్యలు తదితరుల ఘటనలు తరచూ జరుగుతున్న నేపథ్యంలో స్నేహిత బాధ్యతలు స్వీకరించడం జిల్లాలో ప్రాధాన్యత సంతరించుకుంది..

నిజాయతీకి C/O రోహిణి సింధూరి

ప్రభుత్వం ఎటువంటిది అన్నది వారు ఎంపిక చేసుకునే అధికారులను బట్టే తెలుస్తుంది. నిజాయతీ గల ఆఫీసర్లను ప్రభుత్వం వినియోగించుకుంటుందంటే ఆ ప్రభుత్వం అన్యాయాలను సహించబోదని అర్థం. అదే నిజాయతీగల ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు బదిలీలు కోరుతున్నారన్నా, దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారన్నా.. వారు అవినీతిని ఇముడ్చుకోలేకపోతున్నారని అర్థం చేసుకోవచ్చు. ప్రతిసారీ బదిలీలకు గురవుతున్నారంటే వారిని అవినీతి నేతలు ఇష్టపడటం లేదని చెప్పాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం కర్ణాటక కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి డిప్యుటేషన్ మీద ఏపీకి రానున్నారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా రుద్రాక్షపల్లి ఆమె స్వస్థలం. ముక్కుసూటిగా పని చేసే అధికారిగా ఆమెకు పేరుంది. ప్రస్తుతం హసన్ జిల్లా కలెక్టర్‌గా ఆమె పని చేస్తున్నారు.

హసన్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తోన్న రోహిణి సింధూరి కర్ణాటకలో సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. స్వచ్ఛమైన పాలన, ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే ఆమె.. ఓ దశలో మంత్రులకు సైతం చెమటలు పట్టించారు. ఖమ్మం జిల్లా రుద్రాక్షపల్లిలో జన్మించిన దాసరి రోహిణి

హైదరాబాద్‌లో పెరిగారు. ఇంజినీరింగ్ చదివిన ఆమె ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. సివిల్స్ ఎగ్జామ్‌కు నెల రోజుల ముందే రోడ్డు ప్రమాదం బారిన పడ్డారు. ఇబ్బందులు ఎదురైనాసరే సివిల్స్ సాధించారు.

ఆమె

2009 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె.. నెల్లూరు జిల్లాకు చెందిన సుధీర్ రెడ్డిని పెళ్లి చేసుకున్నారు.

ఆరు నెలల్లోనే శ్రావణ బెళగొళలోని గోమతేశ్వరుడి మహామస్తాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు మంత్రి మంజు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలియడంతో తగిన చర్యలు తీసుకున్నారు. ఆమె నిబద్ధత అడ్డంగా మారడంతో.. మంత్రి మంజు ఒత్తిడితో ప్రభుత్వం ఆమెను బదిలీ చేసింది. కానీ కోర్టు జోక్యంతో ఆమెను తిరిగి హసన్ కలెక్టర్‌గానే కొనసాగించారు. మండ్య జిల్లాలో ఏడాదిలోనే లక్ష టాయిలెట్లు నిర్మించిన రోహిణి.. ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఎంతో కష్టపడ్డారు. రైతులకు కరువు సాయం వచ్చేలా చూడటంతోపాటు.. కల్పామృత ప్రాజెక్టు ద్వారా కొబ్బరి నీళ్లను ఎలా మార్కెటింగ్ చేయొచ్చే చేసి చూపించారు. 'స్పందన' బాధ్యతలను ఆమెకు అప్పగిస్తారని సమాచారం.

ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ అవినీతిని సహించబోనని చెబుతున్నారు. అందుకు అనుగుణంగానే చర్యలు తీసుకుంటున్నారు. ఈ దిశలోనే "స్పందన" పేరిట ప్రజా సమస్యల పరిష్కార వేదికకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వంలో ఏ శాఖకు సంబంధించిన సమస్య గురించైనా స్పందన ద్వారా అర్జీ పెట్టుకొని పరిష్కారం పొందొచ్చు. ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని పర్యవేక్షించడం కోసం సమర్థవంతమైన అధికారి కావాలని భావించిన జగన్.. కర్ణాటక కేడర్‌కు చెందిన తెలుగు ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి అమరావతికి రప్పించే ప్రయత్నాలు ప్రారంభించారు. డిప్యుటేషన్ మీద ఆమెను ఏపీకి పంపాలని కోరుతూ.. జగన్ కేంద్రానికి లేఖ రాశారు. కొద్ది రోజుల్లో ఆమె జగన్ టీంలో చేరబోతున్నారు.

మండల స్థాయిలో ఉన్న సమస్యలను తెలుసుకోవడం కోసం ప్రతి సోమవారం 'స్పందన' నిర్వహించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లోగా అర్జీలకు పరిష్కారం చూపిస్తే.. ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకం ఏర్పడుతుందనేది సీఎం భావన.

కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా యువ ఎమ్మెల్యే?

రాజధాని వార్తలు, అమరావతి : ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ యువ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను నియమించబోతున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకుని రాజాకు తెలియజేసినట్లు సమాచారం. రెండు లేదా మూడు రోజుల్లో రాజాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

రాష్ట్ర పీపీగా శ్రీనివాసరెడ్డి

రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా కొనకంటి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఈ పోస్టులో కొనసాగుతారు. క్రిమినల్ కేసులను వాదించడంలో శ్రీనివాసరెడ్డికి మంచి పేరుంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టు భర్తీకి సర్కారు ఇటీవల ముగ్గురు న్యాయవాదుల ప్యానెల్‌ను హైకోర్టుకు పంపింది. నిబంధనల ప్రకారం ఈ ప్యానెల్ నుంచి హైకోర్టు శ్రీనివాసరెడ్డిని ఎంపిక చేసి, అందుకు సంబంధించిన లేఖను ఈనెల 16న రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. హైకోర్టు సిఫారసు మేరకు ప్రభుత్వం శ్రీనివాసరెడ్డిని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీనివాసరెడ్డి హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రాసిక్యూషన్లు, అప్పీళ్లు, ఇతర ప్రొసీడింగ్స్ చేపడతారు. శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

నాటి పాత్రికేయ విలువను నేటితరానికి చెప్పాలి

గోరాశాస్త్రి శత జయంతి వేడుకల్లో వెంకయ్య



రాజధాని వార్తలు, హైదరాబాద్ : సాహిత్య, పాత్రికేయ రంగంలో నేటి తరానికి గోరా శాస్త్రి ఆదర్శంగా నిలుస్తారని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. ప్రముఖ పాత్రికేయులు, కవి, రచయత అయిన గోవిందుని రామశాస్త్రి శతజయంతి సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సొంత ప్రాంతంలో పాత్రికేయులను కలుసుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నాటితరం పాత్రికేయ ఆలోచనలను, విలువలను నేటి తరానికి చాటి చెప్పాల్సిన అవసరముందని ఉపరాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. నిజాన్ని నిర్భయంగా, నిష్కర్షగా చెప్పే గోరాశాస్త్రి రచనలంటే అప్పటి పాఠకులు చెవి కోసుకునే వారని, జ్ఞానసముపార్జన కోసమే ఆయన సంపాదకీయాలను చదివేవారని వెంకయ్యనాయుడు తెలిపారు.

ఏపీలో విస్తారంగా వర్షాలు

రాజధాని వార్తలు, అమరావతి : ఏపీలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రెండు గంటల పాటు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కోనేరు సెంటర్ నుంచి లక్ష్మీ టాకీస్ వరకు నీళ్లు నిలిచిపోవడంతో..వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుంటూరు జిల్లాలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవాని పాలెం మండలాల్లో తెల్లవారు జామునుంచి వర్షం కురుస్తోంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి ఉరుములు,మెరుపులు తోడవ్వడంతో అధికారులు విద్యుత్ నిలిపివేశారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాలు కురుస్తుండటంతో సాగుకు సహకరిస్తుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకాశం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. చీరాల, వేటపాలెం, చినగంజాం, పరుచూరు, మార్టూరు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తోంది. చీరాలలో ఉరుములతో కూడిన జల్లులు పడ్డాయి. వర్షం ధాటికి మార్టూరు మండలం పలపర్రులో పెంకుటిల్లు కూలిపోయింది. చినగంజాంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. యద్దనపూడి మండలం యనమదలలో ఉప్పువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షానికి పరచూరు వాగు ఉరకలేస్తోంది. అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలో అర్ధరాత్రి కుండపోత వర్షం కురిసింది.జెండా వీధి, సీపీఐ కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరింది. కాలనీ వాసులు రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. గుత్తి పట్టణంలో పలు చోట్ల డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండటంతో మురుగునీరు ఇళ్లలోకి చేరింది.

సీఎం ఫొటోకు ససేమిరా..

రాజధాని వార్తలు, అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి జగన్ బాధ్యతలు స్వీకరించి 50 రోజులు పూర్తవుతోంది. కానీ, ఇంకా కొంత మంది ఉద్యోగులు మాత్రం గతంలో పని చేసిన వారే ఇంకా ముఖ్యమంత్రిగా ఉన్నారనే భావనలో ఉన్నారు. ఏపీలోని అన్ని యూనివర్సిటీల్లో ప్రతీ వైస్ ఛాన్సలర్ల ఛాంబర్లలో ముఖ్యమంత్రి ఫొటో ఏర్పాటు చేసారు. అయితే స్వయంగా వీసీ ఆదేశించినా అక్కడ కొంత మంది అధికారులు మాత్రం ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఏర్పాటుకు ససేమిరా అంటున్నారు. గతంలో పని చేసిన ఆయనే తమ సీఎం అని చెబుతున్నారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఫొటో పెట్టేందుకు ప్రయత్నించగా కొంత మంది అడ్డుకుంటున్నారు. తన చాంబర్‌లో సీఎం జగన్ ఫొటో పెట్టాలని స్వయంగా హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ సీవీ రావు ఆదేశించినా సంబంధిత అధికారులు ససేమిరా అంటుననారు. ముఖ్యంగా వర్సిటీలో కీలక పోస్టుల్లో ఉన్న కొంత మంది ఉద్యోగులు సీఎం ఫొటో పెట్టే విషయంలో కింది స్థాయి సిబ్బంది మీద ఒత్తిడి తెచ్చి జగన్ ఫొటో ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటున్నట్లు వర్సిటీలో ప్రచారం జరుగుతోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడ ఇష్టారాజ్యంగా వ్యవహారాలు నడిచాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయం సైతం ఇక్కడ ఏర్పాటు చేసారు.

సీఎం ఫొటో పెట్టే విషయమై ప్రభుత్వం నుంచి జీవో విడుదల కాలేదంటూ కొందరు అధికారులు సాకులు చెబుతు న్నారు. అయితే యూనివర్సిటీ పక్కనే ఉన్న సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలోని ప్రిన్సిపాల్ చాంబర్‌లో..విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీఎం వైఎస్ జగన్ ఫొటో ఇప్పటికే ఏర్పాటు చేసారు. గత ప్రభుత్వంలో ఎక్కడా లేని విధంగా వర్సిటీలోనే రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కార్యాలయం ఏర్పాటు చేసిన అధికారులే.. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ ఫొటో పెట్టేందుకు మనసొప్పక అడ్డుకుంటున్నారని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. వర్సిటీలోని పరిపాలన, ఇంజ నీరింగ్ తదితర విభాగాల్లో కీలక పోస్టుల్లో పనిచేసే కొంత మంది అధికారులు, ఉద్యోగులు గత ముఖ్యమంత్రి మీద అమి తమైన మక్కువతోనే ఈ విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ప్రభుత్వం ఇక్కడి వ్యవహారాల పైన ఏ రకంగా స్పందిస్తుందో చూడాలి.

సీఎం జగన్‌కు డిప్లమాటిక్ పాస్‌పోర్టు

రాజధాని వార్తలు, విజయవాడ : ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి విదేశాంగ కార్యాలయం డిప్లమాటిక్ పాస్ పోర్టును జారీ చేసింది. ముఖ్యమంత్రి హోదాలో ఆయనకు ఈ పాస్ పోర్టును జారీ చేశారు. ఇప్పటి వరకూ సాధారణ పాస్ పోర్టు కలిగిన ఆయనకు తదుపరి విదేశీ ప్రయాణాల సమయంలో ప్రోటోకాల్‌ను వర్తింప చేసేందుకు వీలుగా ఈ డిప్లమాటిక్ పాస్‌పోర్టును జారీ చేశారు. దీనిని తీసుకునేందుకు ఆయన సతీసమేతంగా విజయవాడలోని పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లారు. చేతి వేలిముద్రలు, ఇతర వివరాలను అక్కడి అధికారులకు ఇచ్చారు. మరోవైపు వచ్చే నెల 15 తర్వాత ఆయన తన కుటుంబ సభ్యులతో కలసి అమెరికా వెళ్లనున్నారు. అక్కడ వైకాపా ఎన్ఆర్ఐ విభాగం నిర్వహించే సదస్సుకు ముఖ్యమంత్రి జగన్ హాజరుకానున్నారు.

మందుల కోసం ఏటీఎంలు

రాజధాని వార్తలు, చెన్నై : ఇప్పుడు మీకు చెన్నైలోని ఆస్పత్రుల్లో ఏటీఎం లాంటి యంత్రాలు అక్కడక్కడా కనిపిస్తుంటాయి. అవి ఏటీఎంలే అనుకొని మనీ విత్ డ్రా కోసం వెళ్లారంటే ఆశ్చర్యపోతారు. అవి ఏటీఎంల్లా కనిపించే ఎనీ టైమ్ మెడిసిన్ యంత్రాలు. ప్రభుత్వం నిర్వహిస్తున్న 23 మెడికల్ కాలేజీ హాస్పిటల్స్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటూ మొత్తం 32 చోట్ల ఇలాంటి యంత్రాల్ని ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఈ యంత్రం ద్వారా టీబీ, డయాబెటిస్, హైపర్ టెన్షన్ వంటి 32 రకాల రోగాలకు మందులు పొందవచ్చు. మెడికల్ షాపుల ముందు క్యూలో నిలబడే పనిలేకుండా... ఈ యంత్రాల ద్వారా అత్యంత త్వరగా, తేలిగ్గా కావాల్సిన మందులను పొందేందుకు వీలవుతుంది. మనకు కావాల్సిన మందుల ప్రిస్క్రిప్షన్‌లో కోడ్ ఉంటుంది. మందులు కావాలనుకునే వారు ఈ కోడ్‌ని యంత్రానికి చూపించాల్సి ఉంటుంది. యంత్రం ఆ కోడ్‌ని స్కాన్ చేసి ఎన్ని మందులు కావాలో అడుగుతుంది. ఎంత రేటు అవుతుందో చెబుతుంది. ఆ డబ్బు ఇవ్వగానే వెంటనే మందులు ఇచ్చేస్తుంది. రూ.80 లక్షలు ఖర్చు పెట్టి ప్రభుత్వం 32 యంత్రాల్ని ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి పళనిస్వామి తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత మందులను సమస్యలు ఉన్న అందరూ వాడాలన్న ఆయన... ఈ యంత్రాల ద్వారా ఆ మందులను కూడా పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం రూల్ 110 కింద అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం త్వరలో 'నా ఆస్పత్రి నాకు గర్వకారణం' అనే స్కీమ్ తేబోతున్నారు. దీని ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులు ప్రభుత్వ ఆస్పత్రుల నుంచీ వచ్చే పేషెంట్లను ఎంతో మర్యాదగా ట్రీట్ చెయ్యాల్సి ఉంటుంది. ఇలాంటి 11 నిర్ణయాలు తీసుకున్నట్లు పళనిస్వామి వివరించారు.

ట'మోత' కేజీ రూ. 80

న్యూఢిల్లీ : కూరగాయల ధరలు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఎండకాలంలో ఠారెత్తించిన కూరగాయల ధరలు.. వర్షకాలం ప్రారంభమైన తగ్గడం లేదు. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో టమాటా ధరలు సాధరణం కంటే మూడింతలు పలుకుతున్నాయి. దీంతో వినియోగదారులు టమాటా కొనాలంటే భయపడిపోతున్నారు. వారం క్రితం కిలో 20 నుంచి 30 రూపాయలు పలికింది. అయితే ఉన్నట్టుండి టమాటా ధర 60 నుంచి 80 రూపాయలకు చేరింది. ఈ ధర రూ. 100కు చేరిన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని పహర్గంజ్ మండి వ్యాపారులు తెలిపారు. అలాగే బెండకాయ, ఉల్లిపాయ, కొత్తిమీర ధరలు కూడా పెరుగుతూనే ఉన్నాయని అన్నారు. భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని పేర్కొన్నారు. వర్షకాలం తరువాతే కూరగాయల ధరలు తగ్గే అవకాశం ఉన్నట్టు వారు అంచనా వేస్తున్నారు.

రాజధాని క్లాసిఫైడ్స్

ప్రకటనలకు సంప్రదించండి
9440662699

షాప్స్

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

తుళ్ళూరు
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్
నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా,
సెల్ : 9182155644

అరుణోదయ
హెచ్.పి.గ్యాస్ ఏజన్సీ
హుస్సేన్ కట్ట వద్ద,
పాత మంగళగిరి,
9848111905

గుంటూరు
న్యూసిటి లింబ్ సెంటర్
ఫోన్ : 9951066705

ఇల్లు అమ్మకం
గుంటూరు నగరంలోని బొంగరాల బీడు ఏరియా లోని స్వాతి పేట, హౌస్ నెంబర్ : 7-6-132, గుంటూరులో.....140 చదరపు గజాల విస్తీర్ణంలోని రెండు రేకుల ఇళ్లు అమ్మ కానికి కలవు. సంప్రదించండి ...99856 58208

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

రాయపూడి
చంద్రిక ట్రైడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

రాయపూడి
శివ గంగా వాటర్
ఫోన్ : 9618965739

రాయపూడి
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

వెలగపూడి
సాయి గణేష్ ట్రైడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

రాయపూడి
గోపి గోపిక రెడీమెడ్ గార్మెంట్స్
ఫోన్ : 97031 20890

మంగళగిరి
శ్రీ పూజిత హెయిర్ అండ్ బ్యూటీ
ఫోన్ : 799301511

మంగళగిరి
శ్రీదుర్గా డిజైనర్స్ (లేడీస్ టైలర్స్)
ఫోన్ : 9959308664

విజయవాడ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘంలిమిటెడ్
ఫోన్ : 0866-2452129

విజయవాడ
స్టార్స్ ఆటోమొబైల్స్
ఫోన్ : 9848518117

రాయపూడి
చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్
ఫోన్ : 08645-244266

సాగర్ బోర్ వెల్స్
సరసమైన ధరలకు మీరు మేచ్చే విధంగా మీ నీటి అవసరాలను తీచ్చేందుకు 4 3/4, 6 1/2, రొటరీ, రిగ్గ్ బోర్లు వేయబడును
ప్రొ॥ మల్లవరపు రమేష్ బాబు
మంగళగిరి
7981075683, 9652246869

హోటల్స్

రాయపూడి
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ : 9848021898

మల్కాపురం
స్వాగత్ మెస్ ప్యూర్‌వెజ్
ఫోన్ : 90329 58580

రాయపూడి
వేణుగోపాల రెడిమేడ్స్ ఫాన్సీ & హోమ్ నీడ్స్
ఫోన్ : 98483 83650

రాయపూడి
శ్రీ వేంకటేశ్వర ఫుడ్స్
రుచికరమైన భోజనం
ఫోన్ : 76759 70341

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

హస్పటల్స్

విజయవాడ
నవీన డెంటల్ & ఇంప్లాంట్ కేర్
7893187172

విజయవాడ
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

విజయవాడ
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

తుళ్ళూరు
శ్రీనివాస మెడికల్ & ఫ్యాన్సీ స్టోర్స్
ఫోన్ : 9849216110

మందడం
హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్
ఫోన్ : 8008685824

రాజధాని వార్తలు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల పుస్తకం రానుంది.
-9440662699

చినకాకాని
ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ & జనరల్ హాస్పిటల్
ఫోన్ : 08645-230101

విజయవాడ
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

యూనివర్సిటీ

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

ఐనవోలు
విఐటీ యూనవర్సిటీ
ఫోన్ : 0863 2370444

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
- మేనేజర్

భూస్వామి కండకావరం

ముస్లింలను ఉగ్రవాదులుగా, ఎస్సీ,ఎస్టీలను మావోయిస్టులుగా, ప్రశ్నించే గొంతులను దేశద్రోహులుగా పరిగణిస్తూ, దేశంలో హింసాత్మక విభజనను ప్రోత్సహించి తద్వారా అధికారాన్ని గుప్పిట్లో ఉంచుకోవడానికి బీజేపీ ప్రభుత్వం దురాగతతాలకు పాల్పడుతోంది. బాధితులనే నిందితులుగా మార్చే రాజకీయ- పోలీసు వ్యవస్థ ఉండటం మన దౌర్భాగ్యం. ఉత్తరప్రదేశ్‌లోని సోన్ భద్ర జిల్లాలోని ఉభా గ్రామంలో గిరిజన భూములపై కన్నేసిన అగ్రవర్ణాలు వారి భూములను ఆక్రమించుకునేందుకు గిరిజనులను పిట్టలను కాల్చినట్టుగా 10 మందిని కాల్చిచంపినా బీజేపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌కు పట్టడం లేదు. ఈ పరిస్థితి 73 ఏళ్ల స్వతంత్ర భారతావనికి సిగ్గుచేటు.. మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను రాజకీయ కీచకులు ఎలా అనుభవిస్తున్నారో... గుర్తించి జాగ్రత్త పడకుంటే దేశప్రజలకు ముప్పే..

ఉత్తరప్రదేశ్ సోన్‌భద్ర జిల్లాలోని ఉభా చిన్న గిరిజన గ్రామం. గ్రామంలో ముందా తెగకు చెందిన గిరిజనులు అక్కడ నివశిస్తూ, తరతరాలుగా భూమిని సాగుచేసుకొని జీవిస్తున్నారు. జూలై 17న ఆకస్మికంగా 200 మందితో కూడిన సాయుధ గుంపు 32 ట్రాక్టర్ల ట్రాలీలతో ఆయుధాలు, బలమైన ఆయుధాలు, గొడ్డళ్ల, తుపాకులు తీసుకువచ్చింది. వారితోపాటు భూ ఆక్రమణకు పూనుకొన్న గ్రామ ప్రధాన్ (సర్పంచ్) యగ్యదత్ గుర్జార్ కూడా ఉన్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న 100 ఎకరాల భూమిని ట్రాక్టర్లతో దున్నడం ప్రారంభించింది. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నుంచి ఈ భూమిని సాగుచేసుకుంటున్న పేద గిరిజనులు తమ జీవనాధారం పోతోందని ఆందోళన, ఆగ్రహానికి గురయ్యారు. గ్రామంలోని గిరిజనులంతా ఒక్కటై నిరసన తెలిపారు. అది క్రమంగా ఘర్షణకు దారి తీసింది. గ్రామ ప్రధాన్ తీసుకువచ్చిన గూండాలు మహిళలతో సహా గిరిజనులపైన అత్యంత దుర్మార్గంగా లాఠీలు, కర్రలతో బాదారు. గ్రామస్తులు వెనుదిరగక పోవడంతో గూండాలు తుపాకులు పేల్చారు. ముందుగా అక్కడ ఉన్న నేరేడు చెట్లపై కాల్పులు జరిపి అనంతరం గిరిజనులపై నేరుగా కాల్పులు జరిపారని ప్రత్యక్షంగా చూసిన విలేకరులు తెలిపారు. 20 నిమిషాల్లో ఆప్రాంతం అంతా మరుభూమిగా మారింది. మృతులు, గాయపడిన వారి రక్తంతో ఆప్రాంతం తడిసి పోయింది. చెల్లా చెదురుగా పడిన.. చెప్పులు, రక్తం మరకలతో నిండిన బట్టలుపడి ఉన్నాయి. ఈ దురాగతాన్ని గురించి గిరిజనులు విలేకరులకు తెలియచేశారు. పోలీసుల సహాయం కోసం పోలీసు కంట్రోలు రూము నెంబరు 100కు అనేక సార్లు ఫోన్ చేసినా, ఎవరూ పలకలేదని, అపై ఇద్దరు పోలీసులు వచ్చి ప్రేక్షకులవలే ఉండిపోయారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఉన్నత పోలీసు అధికారులు దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయిందని వారంతా వాపోతున్నారు. గాయపడిన వారిని ఘర్వాల్

కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలించడంతో సిబ్బంది చాలక రాబట్స్ గంజ్‌కి తరలించారని చెప్పారు. కాల్పులు జరిగిన చోట ఏడుగురు చనిపోగా, ఆస్పత్రికి తరలించే మార్గంలో ఇద్దరు, ఆస్పత్రిలో ఒకరు మొత్తం 10 మంది చనిపోయారు. మరో 29 మంది గాయపడగా, వారిలో కొందరి పరిస్థితి తీవ్రంగా ఉంది.

అగ్రవర్ణాల కన్ను పడటంతో కొన్ని దశాబ్దాలుగా ఈ భూమి పై వివాదాలు చెలరేగాయి. చివరకు తమకు అనుకూలమైన బీజేపీ ఆధ్వర్యంలోని యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడటంతో సమయం చూసుకొని గిరిజనులపై కిరాతకానికి పూనుకొన్నారు. పేదరికంలోనే పుట్టి పెరుగుతున్న గిరిజనులను ఆ భూముల నుంచి తరిమి వేసేందుకు పక్కా ప్రణాళికతో తెరవెనుక పోలీసులు, అధికార యంత్రాగం అండదండలతో భూముల్లో ప్రవేశించి అక్కడికి చేరుకున్న గిరిజనులపై అత్యంత దుర్మార్గంగా కాల్పులు జరిపి వారి ప్రాణాలను హరించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూమి సారవంతమైంది. ఖరీఫ్ సీజన్లో ఇక్కడ వరి పండిస్తారు. ఇంకా ఇతర తృణ ధాన్యాలను కూడా పండిస్తారు. ఉత్తరప్రదేశ్ ఆగ్నేయ ప్రాంతంలో ఒక చివరిగా చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలకు ఆనుకుని ఉంటుంది. ఈ ప్రాంతంలో విద్యుత్ ప్లాంట్లు , బొగ్గుగని తవ్వకాలు ఎక్కువగా ఉన్నాయి. 1955లో ఆదర్శ సొసైటీ పేరుతో సొసైటీల చట్టం కింద 600 ఎకరాల భూమిని ఆక్రమించుకొని రిజస్ట్రర్ చేయించుకున్నారు. అందులో 100 ఎకరాలను ఈనెల 17న భూస్వామి ప్రవేశించి ఆక్రమించుకోవాలని యత్నించాడు. సొసైటీ పేరుతో రిజస్ట్రర్ అయిన విషయం కూడా గిరిజనులకు తెలియదు. 1950లో యూపీ జమిందారీ రద్దు చట్టం చేశారు. దాన్నుంచి తప్పించుకునేందుకు సొసైటీకి భూమిని రిజస్ట్రర్ చేసినట్లు తెలుస్తోంది.

ఈ వ్యవహారం మరోమలుపు తిరిగింది. ఉత్తరప్రదేశ్‌లో గిరిజనులపై క్రిమినల్ కేసులు బనాయించారు. వాస్తవంగా ఈ భూములను మిశ్రా కుటుంబానికి విక్రయించినట్లుగా గ్రామస్తులు తెలిపారు. మిశ్రా కుటుంబం పాట్నాలో నివశిస్తోంది. మిశ్రా ప్రతి ఏడాది వచ్చి భూమిని సాగుచేసే కుటుంబాల నుంచి కౌలు వసూలు చేసుకొని వెళుతున్నారని గ్రామస్తులు మరో కథనాన్ని తెలిపారు. కొంతకాలం తర్వాత గిరిజనులే భూమిని సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నారు అని చెబుతున్నారు. 2017లో గ్రామ ప్రధాన్ యగ్యదత్ ఆ భూమిని కొనుగోలు చేశాడని కూడా అంటున్నారు... అయితే భూమిని అతనికి ఎవరు అమ్మారు ? అని అడిగితే ఎవరూ సమాధానం చెప్పలేదు.. గ్రామంలో భూస్వాముల ఆధిపత్యం కొనసాగుతోంది. గ్రామప్రధాన్ పూర్వీకులు కొన్ని దశాబ్దాల క్రితం ఇక్కడకు చేరుకొని భూములను ఆక్రమించినట్లు చెబుతున్నారు. ఆయనకు వివిధ రాజకీయ పార్టీలతో మంచి సంబంధాలు ఉన్నాయి. తమపై జరిగిన దాడులకు నిరసనగా , అలాగే తమకు న్యాయం చేయాలని కోరుతూ వేలాది మంది గిరిజనులు ఢిల్లీలో ప్రదర్శన చేశారు. బాధిత కుటుంబాల పరామర్శకు వెళుతున్న యూపీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకను మీర్జాపూర్ జిల్లాలోనే ఆపివేసి,అరెస్టు చేశారు. పట్టపగలు జరిగిన ఈ మారణకాండలోని నిందితులను ఇంతవరకు అరెస్టు చేయలేదు. దేశవ్యాప్తంగా దీనిపై ఒత్తిడి పెరగడంతో సర్పంచ్ యగ్యదత్ గుర్జార్ దగ్గరి బంధువును అరెస్టు చేశామని పోలీసులు చెబుతున్నారు.

ఈ వ్యవహారం తీవ్రతరం కావడంతో ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ హడావిడిగా ఐదుగురు జిల్లా ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేశారు. అలాగే బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించారు. మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనులకు ఎంతవరకు న్యాయం చేకూర్చుతుంది ? దోషులకు ఎంతమేర శిక్ష విధిస్తారన్నది వేచి చూడాల్సిందే.

– బోస్

కౌలు రైతులకు జగన్ సర్కార్ వరాల జల్లు!

- 11 నెలల కాలానికి సాగు ఒప్పంద పత్రాలు
- వైఎస్సార్ భరోసా, ఉచిత పంటల బీమా వర్తింపు
- పంట రుణాలు పెద్ద మొత్తంలో ఇచ్చేందుకు సన్నాహాలు
- అనందం వ్యక్తం చేస్తున్న కౌలు రైతులు

రాజధాని వార్తలు, అమరావతి : కౌలు రైతులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఇందులో భాగంగానే కౌలు రైతు ముసాయిదా బిల్లుకు ప్రభుత్వం అమోద ముద్ర వేసింది. భూయజమానుల హక్కులకు భంగం కలగకుండా, కౌలు రైతులకు 11 నెలల కాలానికి సాగు ఒప్పంద పత్రాలు ఇస్తున్నారు. దీని వలన రైతులకు ఒనగూరే ప్రయోజనాలన్నీ చేకూరనున్నాయి. వీరికి వైఎస్సార్ రైతు భరోసాపాటు, ఉచిత పంటల బీమా, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు అందనున్నాయి. జిల్లాలో దాదాపు 3.60 లక్షల మందికిపైగా కౌలు రైతులు ఉన్నారు.

గత ఏడాది కేవలం 1.02 లక్షల మందికి మాత్రమే ఎల్ఈసీ (రుణ అర్హత కార్డులు) సీవోసీలు (సాగు ధ్రువీకరణ పత్రాలు) ఇచ్చారు. గత ఏడాది కౌలు రైతులకు రూ.200 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. అయితే బ్యాంకర్లు పంట రుణాలు కేవలం



రూ158.95 కోట్ల రుణాలు ఇచ్చారు. ఈ ఏడాది కౌలు రైతులకు రూ.1100 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 75,800 ఎల్ఈసీ కార్డులు, 1000 సీవోసీ పత్రాలు ఇచ్చారు. జిల్లాలో ఎక్కువ మంది పంటలు సాగు చేసేది కౌలు రైతులే కావడం విశేషం.

సీఎం చొరవతో..

ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పంటలు సాగు చేసే రైతులందరికీ సాగు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా కౌలు రైతుల చట్టానికి సవరణ చేశారు. జిల్లాలో దాదాపు 3.60 లక్షల మంది కౌలు రైతులకు వైఎస్సార్ భరోసా కింద ఏడాది రూ.12,500 ఇవ్వనున్నారు. సాగు చేసిన పంటలకు ప్రమాద బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వర్తింపజేస్తారు. ప్రధానంగా పంట రుణాలు ఎక్కువ మొత్తంలో అందనున్నాయి. గత ప్రభుత్వ హయంలో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం గుర్తింపు కార్డులు కూడా దక్కలేదు. దీంతో పంట పెట్టుబడులు రాక తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేకాభిమానంతో కౌలు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సెంటు భూమి ఉండదు.. కానీ ఆ భూమాతకు పచ్చని పారాణి పూసేది ఆయనే.. పెట్టుబడైనా వస్తుందనే గ్యారంటీ లేదు.. కానీ ఆ పుడమి తల్లి ఒడిలోనే గుప్పెడు మెతుకుల కోసం ఆరాటపడేది ఆయనే.. మద్దతు ధర దక్కుతుందనే నమ్మకం లేదు.. కానీ ఏదొక రోజు తన లోగిలిలో సిరుల పంట పండుతుందని ఆశగా ఎదురుచూసేది ఆయనే.. మొక్క ఒంగినా కుంగిపోయేది ఆయనే.. పంట పచ్చగా నవ్వితే పులకించిపోయేది ఆయనే.. పొట్టకొచ్చిన కంకులను చూసి పొంగిపోయేదీ ఆయనే.. చివరకు ప్రకృతి వైపరీత్యాలకు, ప్రభుత్వ నిరాదరణకు నిండా మునిగేదీ ఆయనే.. ఆయనే ఆకుపచ్చని చందమామైన కౌలు రైతు.. ఇప్పుడా కౌలు రైతు బతుకుల్లో వెన్నెల వెలుగులు రాబోతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ నిర్ణయంతో రారమ్మని బ్యాంకు రుణాలు పిలవబోతున్నాయి. అసెంబ్లీలో కౌలు రైతుల ముసాయిదా బిల్లుకు ఆమోదముద్ర పడి.. అన్నదాత ఇంట ఆనందాల పచ్చని కంకులు వేయబోతున్నాయి.

అంబానీ జీతం.. రూ.15కోట్లు

- వరుసగా 11వ ఏడాది ఒకే స్థాయి వేతనం
- ఏటా రూ.24కోట్లు వదులుకుంటున్న వైనం

రాజధాని వార్తలు, దిల్లీ : అపర కుబేరుడు ముకేశ్ అంబానీ వరుసగా పదకొండో ఏడాది తన వార్షిక వేతనాన్ని రూ. 15కోట్లకు పరిమితం చేసుకున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ హోదాలో 2008-09 నుంచి ముకేశ్ ఇంతే జీతం తీసుకుంటున్నారు. దాదాపు ఏటా రూ. 24కోట్లను తృణప్రాయంగా వదులుకుంటున్నారు. కంపెనీలో శాశ్వత డైరెక్టర్లందరి జీతాలు పెరుగుతున్నా ముకేశ్ మాత్రం తన వేతనాన్ని పెంచుకునేందుకు ఇష్టపడట్లేదు.

'ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ కోరిక మేరకు ఈ ఏడాది కూడా ఆయన వేతనాన్ని రూ. 15కోట్లుగా నిర్ణయించాం. యాజమాన్య వేతన స్థాయిలు తక్కువగా

ఉండాలని చెప్పడానికి ముకేశ్ వ్యక్తిగత ఉదాహరణగా నిలిచారు' అని రిలయన్స్ ఇండస్ట్రీస్ తన వార్షిక నివేదికలో పేర్కొంది. 2018-19లోనూ ముకేశ్ ఇంతే మొత్తం జీతంగా తీసుకున్నారు.

- 2018-19లో ముకేశ్ రూ. 4.45కోట్లు జీతంగా అందుకున్నారు. ఇక కమిషన్ కింద రూ. 9.53కోట్లు, ఇతర భత్యాలు రూ. 31లక్షలు, పదవీ విరమణ ప్రయోజనాల కింద రూ. 71లక్షలు తీసుకున్నారు.
- సీఈఓల వేతన పరిమాణాలపై చర్చ నేపథ్యంలో అక్టోబరు 2009న అంబానీ తన వేతనాన్ని స్వచ్ఛందంగా రూ.15 కోట్లకు పరిమితం చేసుకున్నారు. ఇతర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల వేతనాలు పెరిగినప్పటికీ.. ఈయన మాత్రం ఆ మొత్తానికే కట్టుబడి ఉన్నారు.
- అంబానీ బంధువులైన నిఖిల్ ఆర్ మేస్వానీ, హితాల్ ఆర్ మేస్వానీ కూడా కంపెనీలో శాశ్వత డైరెక్టర్లుగా ఉన్నారు. వీరి వేతనాలు రూ. 20.57కోట్లకు పెరిగాయి. ఎగ్జిక్యూటివ్ పీఎంఎస్ ప్రసాద్ వేతనం రూ. 8.99కోట్ల నుంచి రూ. 10.01కోట్లకు పెరిగింది.
- నీతా అంబానీ సహా కంపెనీ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు రూ. 1.65కోట్ల కమిషన్ లభించింది. సిట్టింగ్ ఫీజుకు ఇది అదనం. అంతక్రితం ఏడాది ఈ కమిషన్ రూ. 1.5కోట్లుగా ఉంది. సిట్టింగ్ ఫీజు కింద నీతా అంబానీ రూ. 7లక్షలు అందుకున్నారు. గతేడాది రిలయన్స్ బోర్డులో చేరిన ఎస్‌బీఐ మాజీ ఛైర్‌పర్సన్ అరుంధతీ భట్టాఛార్య రూ. 75లక్షల కమిషన్ తీసుకున్నారు.

'ఇస్మార్ట్ శంకర్' మూవీ రివ్యూ

పూరి జగన్నాథ్.. హీరోలను మాస్ కోణంలో ఆవిష్కరించే అతి కొద్ది మంది దర్శకుల్లో ఈయనొకరు. అయితే టెంపర్ తర్వాత ఈయనకు సరైన సక్సెస్ దక్కలేదు. ఈ క్రమంలో పూరి దర్శక నిర్మాతగా తెరకెక్కించిన చిత్రం ఇస్మార్ట్ శంకర్. ఈసారి ఎలాగైనా హిట్ కొట్టాలనే ఉద్దేశంతో మాస్ సై ఫై జోనర్‌లో కథను రాసుకున్నాడు పూరి.. ఇప్పటి వరకు క్లాస్ హీరోగా మెప్పించిన రామ్‌తో ఈ సినిమా చేయాలని పూరి నిర్ణయం తీసుకోవడం కొసమెరుపు. దీంతో మాస్‌గా రామ్ లుక్ ఎలా ఉంటుందోననే ఆసక్తి అందరిలో నెలకొంది. ఫస్ట్ లుక్, టీజర్, ట్రైలర్‌తో రామ్ లుక్‌ను సరికొత్త కోణంలో చూపించాడు పూరి. అలాగే సినిమాలో ఎంత మాస్ ఉంటుందోఅర్థమయ్యేలాగానే పూరి టీజర్, ట్రైలర్‌ను కట్ చేశాడు. మరి పూర్తి స్థాయి పూరి హీరోగా రామ్ ప్రేక్షకులను ఎలా మెప్పించాడో తెలుసుకోవాలంటే సినిమా కథేంటో చూద్దాం...

కథ

శంకర్ (రామ్) పక్కా తెలంగాణ బస్తీ కుర్రాడు. అతని మాట తీరు, వేషభాషలూ అన్నీ అలాగే ఉంటాయి. అతనికి తన కాకా (మధుసూదన్ రావు) ఎంత చెబితే అంత. ఏది చెబితే అంత. కాకా చెప్పాడని మాజీ మంత్రి కాశీ విశ్వనాథ్ (పునీత్ ఇస్సార్) ను చంపేస్తాడు. అతను ఇచ్చిన డబ్బుతో తను ప్రేమించిన చాందిని (నభా నటేష్)ను తీసుకుని గోవాకు వెళ్తాడు. అక్కడ వారిద్దరూ ఉండగా కొందరు సీబీఐ ఆఫీసర్లు అటాక్ చేస్తారు. చాందిని కన్నుమూస్తుంది. శంకర్ తప్పించుకుని హైదరాబాద్ వచ్చేస్తాడు. చాందినిని ఎవరు చంపారు? ఎందుకు చంపారు? అసలు కాకాకు కాశీ విశ్వనాథ్‌ను చంపమని ఎవరు పురమాయించారు? అనేది తెలుసుకోవాలని శంకర్ తాపత్రయం. ఆ క్రమంలో ఉండగానే అతనికి జమాల్ ఆచూకి తెలుస్తుంది. అతన్ని వెతుక్కుంటూ శంకర్‌తో పాటు సీబీఐ ఆఫీసర్ అరుణ్ (సత్యదేవ్) కూడా వస్తాడు. కాల్పుల్లో అరుణ్ కన్నుమూస్తాడు. శంకర్ గాయపడతాడు. అరుణ్ గర్ల్ ఫ్రెండ్ సారా (నిధి అగర్వాల్) న్యూరో సైంటిస్ట్. తాను చేసిన పరిశోధనను ఉపయోగించి అరుణ్ జ్ఞాపకాలను శంకర్ బుర్రలోకి చిప్ రూపంలో ఎక్కిస్తుంది. అప్పటిదాకా ఎలుకల మీద మాత్రమే ప్రయోగించిన ఆ పరిశోధన శంకర్ మీద పనిచేస్తుందా? అరుణ్ జ్ఞాపకాలన్నీ శంకర్ మదిలోకి వచ్చి, అతను ఏం చేశాడు? సారా చేసిన ప్రయోగం ఫలించిందా? ఇంతకీ మాజీ మంత్రి కాశీ విశ్వనాథ్‌ను చంపమని ఎవరు పురమాయించారు? అసలు సీఎం ధనుంజయ్‌కీ, అతని మామ రామ్మూర్తి (ఆశిష్ విద్యార్థి)కి ఈ హత్యతో ఉన్న సంబంధం ఏంటి? ఆఖరికి కాశీ విశ్వనాథ్ భార్య (తులసి) శంకర్‌కు ఏం పురమాయిస్తుంది? వంటివన్నీ సెకండాఫ్‌లో తెలుస్తాయి.

విశ్లేషణ

పూరి జగన్నాథ్ హీరోలు అనగానే మాస్ లోకి మాస్‌గా ఉంటారు. ఇస్మార్ట్ శంకర్ సినిమా గురించి ప్రస్తావించినప్పటి నుంచీ శంకర్ పాత్ర అలాగే ఉంటుందని తెలుస్తూనే ఉంది. దానికి తోడు రామ్ ఇప్పటిదాకా ఎప్పుడూ మాట్లాడని తెలంగాణ యాసలో మాట్లాడటం. ఇస్మార్ట్ శంకర్ లో రామ్ లుక్ బావుంది. ఇంతకు ముందు ఆయన వేయని గెటప్ ఇది. మాట్లాడని భాష ఇది. కొన్ని కొన్ని సామెతలు తెలంగాణ యాసలో రామ్ చెబుతుంటే థియేటర్లలో విజిళ్లు వినిపించాయి. క్లైమాక్స్ లో సిక్స్ ప్యాక్ లుక్ కూడా ఆకట్టుకుంటుంది. ఇప్పటిదాకా మిల్కీ బోయ్‌లాగా కనిపించిన రామ్ ఈ సినిమా కోసం కొంచెం టాన్ అయి కనిపించారు. ఫ్లోర్ స్టెప్స్, పాటలతో మెప్పించారు.

చాందిని పాత్రలో నభా నటేష్, సారా పాత్రలో నిధి అందాల ఆరబోతకు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. హుషారైన పాత్రలో నభా తనవంతు బాగానే చేసింది. కానీ ఒకవైపు ప్రియుడి పోయినప్పుడు, మరోవైపు అప్పటిదాకా కాపురం చేసిన శంకర్ మీద

పోలీసులు దాడిచేసినప్పుడు... నిధిలో ఎమోషన్స్ పండలేదు. ఒక రకమైన బ్లాంక్ ఫేస్‌తో, శోకంగా కనిపించింది. క్రిమినల్ దగ్గర పెరిగిన శంకర్‌కు తాను హత్య చేయడానికి వెళ్తున్నది మాజీ మంత్రి అని తెలియకపోవడం కూడా అంత తేలిగ్గా మింగుడు పడే విషయం కాదు. మనిషి మెదడులో చిప్ పెట్టి, అతని జ్ఞాపకాలను మరో వ్యక్తి బుర్రలోకి పంపడం ఈ చిత్రంలో చూపించినంత తేలికైన విషయమా?... డాటా ట్రాన్స్ ఫర్ ఎంత లోడ్ అయిందో చూపించగలుగుతామా? అవన్నీ ఫిక్షనే అనుకున్నప్పటికీ, ట్రాన్స్ ఫర్ అయిన డేటా శంకర్ మదిలో మళ్లీ మెదిలేటప్పుడు తన ప్రేయసి నీళ్లల్లో తడుస్తూ అందాలను ఆరబోస్తున్న సన్నివేశాలే గుర్తుకొస్తాయా? ప్రాణాలకు తెగించి సేకరించిన విషయం తాలూకు సమాచారం గుర్తుకు రాదా? పైగా ఒక స్టేట్‌కి సీఎం కట్టుదిట్టమైన భద్రతల మధ్య ఎక్కడో వారణాసిలో కొడుక్కి నామకరణం చేస్తుంటే, అక్కడికి లే మేన్ శంకర్ ఎలా చేరుకుంటాడు? అప్పుడు శంకర్ చెప్పే డైలాగుల్లో ఉన్నట్టు... అదంతా లైవ్ టెలికాస్ట్ అయితే అక్కడికి పోలీసులు ఎందుకు చేరుకోరు? సీబీఐ ఆఫీసర్లు అందరూ సీబీఐ అని రాసి ఉన్న జాకెట్లు ఎందుకు వేసుకుని తిరుగుతుంటారు?... ఇలాంటివెన్నో ప్రశ్నలు. అయినా రామ్ మాట్లాడిన యాస, పూరి సినిమా అనే మార్కు, జనాల్లోకి వెళ్లిన పాటల సాయంతో బీ, సీ ప్రేక్షకులను ఆకట్టుకుంటే మాత్రమే... కాసులు కురుస్తాయి.

రాజకీయాలకు పవన్ ఇంటర్వల్..!

రాజధాని వార్తలు, అమరావతి/హైదరాబాద్ : పవన్ కళ్యాణ్ సినిమాలకు తెలుగు రాష్ట్రాల్లో ప్రజాదరణ ఉంది. చిన్న పిల్లలనుండి పెద్దల వరకూ పవన్ కళ్యాణ్ సినిమాలకు ఫిదా అవుతుంటారు. పవన్ కళ్యాణ్ ఒక సినిమా హిట్ అయితే మార్కెట్ లో రెండు మూడు సంవత్సరాలు తిరుగుండదు. వచ్చే ఎన్నికలకు ఎలాగూ నాలుగేళ్లకు పైనే సమయం ఉండడంతో సినిమాలు చేసుకుంటే శ్రేయస్కరంగా ఉంటుందనేది జనసైనికుడి ఆలోచనగా తెలుస్తోంది. అంతే కాకుండా పవన్ సినిమా అంటే నటులు కాకుండా దాదాపు 500మందికి ఏడాది పాటు జీవనోపాధి ఉంటుందనేది పరిశ్రమలో చెప్పుకునే మాట. ఏడాదికా ఒక సినిమా చొప్పున మూడేళ్లు మూడు సినిమాలు ఒప్పుకున్నా వేల కోట్లలో వ్యాపారం ఉంటుందనేది కూడా సిని పరిశ్రమ వర్గాలు చెప్పుకొస్తున్నాయి. దీంతో ప్రజా సమస్యలనై స్పందిస్తూనే వచ్చే ఎన్నికలలోపు మూడు లేదా నాలుగు సినిమాలు చేయాలనేది జనసైనికుడి మనసులోని మాటగా తెలుస్తోంది.

టాలీవుడ్ ఇండస్ట్రీలో టాప్ పొజిషన్లో కెరియర్ వున్న సమయంలో ప్రజల కోసం మరియు ప్రశ్నించడం కోసం రాజకీయాల్లోకి వచ్చాను అంటూ జనసేన పార్టీని 2014 ఎన్నికల సమయంలో స్థాపించి ఆ సమయంలో చంద్రబాబు కి మద్దతు తెలిపి టిడిపి



అధికారంలోకి రావటం లో కీలక పాత్ర పోషించారు పవన్ కళ్యాణ్. ఇదిలా ఉండగా తర్వాత జరిగిన 2019 ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేసిన పవన్ కళ్యాణ్ పార్టీ ఘోరంగా ఓడిపోవడం టాలీవుడ్ ఇండస్ట్రీలో మరియు రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. కేవలం ఒకే ఒక స్థానాన్ని గెలుచుకుంది పవన్ కళ్యాణ్ పార్టీ. అంతేకాకుండా పవన్ కళ్యాణ్ పోటీ చేసిన 2 చోట్ల కూడా ఓడిపోవడంతో శ్రేణులు కొంత అసంతృప్తికి లోనయ్యారు.

అటు రాజకీయాలు..ఇటు సినిమాలు..! సమన్వయం చేసుకోవాలంటున్న కార్యకర్తలు..!! ఎన్నో అంచనాలు పెట్టుకున్న జనసేన పార్టీ

సినిమా

2019 ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడంతో పవన్ కళ్యాణ్ సినిమాలు చేస్తే బెటర్ అంటూ ప్రస్తుతం వార్తలు వస్తున్నాయి. పవన్ కళ్యాణ్ ఇప్పటికిప్పుడు సినిమా చేస్తాను అంటే చాలా మంది నిర్మాతలు క్యూ కడతారని...పవన్ ఎంత ఆఫర్ చేస్తే అంత ఇవ్వటానికి చాలామంది ఇండస్ట్రీలో ఉన్న నిర్మాతలు రెడీగా ఉన్నారని ఫిలింనగర్ టాక్. మరోపక్క పవన్ కళ్యాణ్ సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే ఆయన అమెరికా నుండి వచ్చాకే నిర్ణయం తీసుకుంటారని పరిశ్రమలో టాక్. కానీ పవన్ కళ్యాణ్ మాత్రం సినిమాలు చేయటం ఇంకా కుదరదని ఒక్కసారి మాట తీసుకుంటే వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఉన్న జీవితం ప్రజా పోరాటం కోసమే ఉందని...కట్టే కాలే వరకు..జనసేన పార్టీ కి ప్రాతినిధ్యం వహిస్తానని వెల్లడించిన విషయం తెలిసిందే. మరోపక్క అభిమానులు మాత్రం పవన్కళ్యాణ్ సినిమాలు చేయాలని కోరుకుంటున్నారు. ఇటువంటి క్రమంలో పవన్ కళ్యాణ్ అభిమానుల కోరిక తీరుస్తారో లేదో చూడాలి.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 94406 62699, Email : rajadhanivartalu1@gmail.com